క్లుప్తంగా

బోసిపోయిన సంత



నిర్మానుష్యంగా ఉన్న సంతబయలు సంత

జి.మాడుగుల: ఎన్నికల కౌంటింగ్ దృష్టిలో పెట్టుకుని జి.మాడుగుల మండలం సంతబయలులో మంగళవారం నిర్వహించాల్సిన వారపు సంతను రద్దు అయింది. ఎన్నికల కోడ్ దృష్ట్యా జి.మాడుగుల పోలీసులు ముందస్తుగా వ్యాపారస్తులు, రైతులకు సమాచారం అందించి సంత రద్దు చేశారు. దీంతో వారపు సంత జరిగే సంతబయలు గ్రామం బోసిపోయింది. పరిసర ప్రాంతాలు ప్రశాంత వాతావరణం నెలకొంది.

నేడు మాస శివరాత్రి పూజలు

అనకాపల్లి: స్థానిక శారదానది ఒడ్డున బుధవారం ఉదయం 10 గంటలకు మాస శివరాత్రి సందర్భంగా ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో లలితా శివ సహస్ర నామ పారాయణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు సాలగ్రామ రఘు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

వైభవంగా అమ్మవారి ఉత్సవాలు

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు గుడ్లవానిపాలెం ప్రాంతంలో గల శ్రీ భూలోకమ్మ, ముత్యాలమ్మ, పోలమాంబ అమ్మవార్ల జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. స్థానిక మహిళలు అమ్మవార్లకు పసుపు, కుంకుమ సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు 11న అనుపోత్సవంతో ముగుస్తాయని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై డ్రాయింగ్ పోటీలు నేడు

అనకాపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు పోటీలు జరుగుతాయన్నారు. పర్యావరణ పరిరక్షణ అంశంపై మూడు విభాగాలుగా పోటీలు నిర్వహిస్తామన్నారు.

వరినారు మడులు సిద్ధం




వీరనారాయణంలో సిద్ధం చేస్తున్న నారుమడి

మాడుగుల రూరల్: ఇటీవల అడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు వరినారు మడులు సిద్ధం చేస్తున్నారు. మండలంలో సాధారణ వరి విస్తీర్ణం 10,560 ఎకరాలు కాగా, గతేడాది 11 వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ఈ ఏడాది ఇప్పటికే నారుమడులను దున్ని సిద్ధం చేస్తున్నారు. దీంతోపాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా మరో రెండు రోజుల వ్యవధిలో వరి విత్తనాలు విక్రయానికి సిద్ధం చేస్తున్నారు. రైతులు ప్రస్తుతం వరి నారుమడులు సిద్ధం చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు.

బోసిపోయిన రహదారులు

- టీవీలకు అతుక్కుపోయిన జనాలు



జనసంచారం లేక బోసిపోయిన నర్సీపట్నం-వడ్డాది ఆర్అండ్‌బీ రోడ్డు

రోలుగుంట: సార్వత్రిక ఎన్నికల లెక్కింపు వేళ మంగళవారం ఉదయం నుంచి రోడ్లన్నీ బోసిపోయాయి. పోలింగ్ ప్రక్రియ జరిగి లెక్కింపు, ఫలితాల కోసం మూడు వారాలుగా ఆయా పార్టీల నాయకులు, ప్రజలు తీవ్ర ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో జనాలు, వ్యాపారులు, ఆటోవాలాలు సైతం ఫలితాలు వీక్షించేందుకు టీవీలకు అతుక్కుపోయారు. దీంతో రహదారులు బోసిపోయాయి. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఆయా పార్టీల ఆధిక్యత, విజయం వీచికలు కొలిక్కి రావడంతో కార్యకర్తలు, అభిమానులు రోడ్లపైకి వచ్చి సందడి చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఎస్సై ఎల్. సురేష్ తన సిబ్బంది, ప్రత్యేక సిబ్బందితో అల్లర్లు అరికట్టే చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా నిఘా గ్రామాల్లోను, రోలుగుంట జన సమూహ కేంద్రాల్లోనూ ఎస్సై తన వాహనంలో అరగంటకొకసారి పర్యవేక్షించారు.

జోరుగా వేసవి దుక్కులు



పెదబయలులో వేసవి దుక్కుల పనుల్లో రైతులు



రాగుల సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు

- చీడపీడల నివారణ సాధ్యం
- తగ్గనున్న ఎరువుల వినియోగం

పెదబయలు: మన్యంలో వేసవి దుక్కులు జోరందుకున్నాయి. చీడపీడల నివారణకు ప్రస్తుత దుక్కులు ఎంతగానో ఉపయోగపడతాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో పంటల సాగు కోసం దుక్కులు అనివార్యమంటున్నారు. దీంతో భూసారం పెరిగి, తద్వారా పంటల దిగుబడి ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. ఫలితంగా రైతులు వేసవి దుక్కలపై ఆశక్తి పెరిగింది. మండలంలోని 23 గ్రామ పంచాయతీ పరిధిలో ఖరీఫ్ పంటలకు రైతులు సన్నద్ధమయ్యారు. గత నెలలో వర్షాలు పడుతుండడంతో మండలంలో ఎక్కువగా వేసవి దుక్కుల పనులు జరుగుతున్నాయి.

ఆశాజనకంగా పంటల దిగుబడి

మండలంలో వరి, రాగులు, సాములు, మొక్కజొన్న, వేరుశనగ ఇతర పంటల సాగుకు సంబంధించి వేసవి దుక్కులు చేస్తున్నారు. వేసవి దుక్కి వల్ల మట్టి వదులుగా అవుతుందన్నారు. భూమిలో ఎక్కువ నీరు ఇంకి శక్తి పెరుగుతుందని, మొక్కలు వదులుగా భూమిని అంటిపెట్టుకుని ఉంటాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వేసవి దుక్కల వల్ల సాగుకు తెగుళ్ల అవశేషాలు కీటకాలు, పురుగుల గుడ్లు, లార్వాలు ఎండకు ఎండి చనిపోతాయని, దీంతో సంతతి తగ్గుతగ్గి పంట దిగుబడి పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందంటున్నారు. మన్యంలో ఖరీఫ్ పంటలకు సంబంధించి రైతులు ఎక్కువగా వేసవి దుక్కల చేయడం మేలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. కలుపు నివారణ ఎక్కువగా జరుగుతుందన్నారు. మన్యంలో ఎక్కువగా పంటలు వర్షాధారంపై పండుతున్న వేసవి దుక్కులు చేసి ఉంటే వర్షాలు ప్రారంభం కాగానే పంట వేయడం జరుగుతుందన్నారు. దీంతో పంట ఏపుగా వస్తుందని, అయితే రైతులు ఒకటి, రెండు దుక్కులు చేసిన తరువాత పశువుల గెత్తం పలుచగ చల్లి పంట వేస్తే మరింత దిగుబడి వస్తోందని చెబుతున్నారు.

వేసవి దుక్కులతో మేలు



మండలంలో వ్యవసాయానికి సంబంధించి నూతన సాగు పద్ధతులపై వ్యవసాయాధికారులు తరచూ సూచనలు అందిస్తున్నారు. వ్యవసాయాధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి సాగును పరిశీలించి, సలహాలిస్తున్నారు. వేసవి దుక్కుల వల్ల మేలు జరుగుతుంది.

– పోయిభ కృష్ణారావు, రైతు, గొందికోడాపుట్టు గ్రామం

సాగుపై రైతులకు సూచనలు



పంటలు, విత్తనాలు ఎంపిక, నీరు వేయడం, నాటడం, పంటలకు చీడపీడలు సోకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు వ్యవసాయ సిబ్బంది సూచనలు అందిస్తున్నారు. గతంలో కంటే ఈ ఏడాది వర్షాలు కురువడంతో వేసవి దుక్కులు రైతులు పూర్తి చేశారు. ఖరీఫ్ పనులు జోరందుకున్నాయి.

– ఎ.శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి. పెదబయలు మండలం

పొంచి ఉన్న ప్రమాదం



చోటముఖిపుట్టు వద్ద ఆర్అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గోయ్యి

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి పెదబయలు వెళ్లే ఆర్అండ్‌బీ మార్గంలో చోటముఖిపుట్టు గ్రామ సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద ఏర్పడిన గోతితో వాహనదారులు నిత్యం భయం భయంగా ప్రయాణం సాగిస్తున్నారు. కల్వర్టుకు రహదారికి మధ్య గోయ్యి ఉండడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో తరచూ వాహనచోదకులు గోతిలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారని పలువురు చెబుతున్నారు. చోటముఖిపుట్టు గోతిని పూడ్చాలని ఇప్పటికై పలుమార్లు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు మండల సర్వసభ్య సమావేశంలో ఆర్అండ్‌బీ అధికారులను కోరారని పలువురు చెబుతున్నారు. కానీ నేటికీ ఆర్ అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ప్రజాప్రతినిధులతో పాటు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు స్పందించి గోతిని పూడ్చాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో కిరణ్‌కుమార్ మట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు



దేవరాపల్లిలో సన్యాసమ్మ తల్లిని దర్శించుకుంటున్న గ్రామ పెద్దలు, భక్తులు

దేవరాపల్లి: గ్రామదేవత సన్యాసమ్మ తల్లికి మంగళవారం దేవరాపల్లి గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయం వద్ద ఎటువంటి అసౌకర్యం లేకుండా ఆలయ ధర్మకర్త వరదపురెడ్డి లలితానాయుడు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ నెల 4న అమ్మవారి ఒడ్డు పండగ జరగాల్సి ఉండగా, ఎన్నికల కోడ్ అమలుతోపాటు అదే రోజు ఓట్ల లెక్కింపు జరగనుండటంతో పోలీసుల సూచన మేరకు ఈ నెల 18కు వాయిదా వేశారు. అయినప్పటికీ యధావిధిగా మంగళవారం భక్తులు అమ్మవారిని దర్శించుకుని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు చేశారు. కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, గండిపడాల అప్పలరాజు, సోమిరెడ్డి పేరునాయుడు, వేచలపు అప్పలనాయుడు, మాజీ ఎంపీటీసీ సామిరెడ్డి సత్యవతి, తదితర గ్రామ పెద్దలు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆకట్టుకుంటున్న చిన్నారుల కోలాట నృత్యాలు




కోలాటం ప్రదర్శనలో చిన్నారులు

రాజవొమ్మంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 4 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న చిన్నారులు గ్రూపుగా ఏర్పడి ఖాళీ సమయాల్లో కోలాట ప్రదర్శనలు ఇస్తున్నారు. శ్రీ నూకాంబికా కోలాట బృందం పేరుతో ఆలయాల వద్ద పండుగలు, ఉత్సవాలు తదితర వేడుకల్లో ఉచితంగా ప్రదర్శిస్తున్నారు. ఈ చిన్నారుల నృత్యాలు ఆకట్టుకుంటున్నాయి. వీరి ప్రతిభను స్థానికులు అభినందిస్తున్నారు. టీవీల్లో వచ్చే కార్యక్రమాలు చూసి సొంతంగా ఈ కళ నేర్చుకున్నట్టు చిన్నారులు చెబుతున్నారు. తమకు మరింత ప్రోత్సాహం అందిస్తే మరింత కోలాటం తదితర భారతీయ సంప్రదాయ నృత్యాల్లో శిక్షణ పొంది ఉత్తమ ప్రదర్శన ఇస్తామంటున్నారు. ఈ చిన్నారులకు కుమారి, లక్ష్మి అనే స్థానిక మహిళలు కోలాటంలో శిక్షణ ఇస్తున్నారు.

జీడి పంటకు వర్షం దెబ్బ

- నాణ్యత లోపించిన పిక్కలు
- కిలో రూ.80లోపే, గత ఏడాది రూ.110పైగా ధర పలికిన వైనం
- లబోదిబోమంటున్న రైతులు



నల్ల మచ్చలతో నాణ్యత లోపంగా ఉన్న జీడి పిక్కలు

ముంచంగిపుట్టు: గిరిజన ప్రాంతంలో గత కొన్ని నెలలుగా కురిసిన వర్షాలతో జీడి పిక్కల పంటపై తీవ్ర ప్రభావం చూపింది. దీంతో జీడి పిక్కలు పూర్తిగా నాణ్యత లోపించాయి. గతంలో లేని విధంగా ఈ ఏడాది జీడి పిక్కల ధర భారీగా పడిపోయింది. అకాల వర్షాలతో జీడి పంటకు వర్షం దెబ్బ తగిలింది. వర్షాంతో జీడి పిందెలు, పిక్కలు చెట్టు నుంచి రాలిపోయాయి. ఈదురు గాలులు, వడగండ్ల వర్షాలకు జీడి పిక్కల్లో నాణ్యత లోపించింది. దీన్ని అనుకూలంగా మార్చుకున్న ప్రైవేట్ వ్యాపారులు రూ.80 చొప్పున ధరను నిర్ణయిస్తూ గిరిజన రైతులకు దెబ్బ కొడుతున్నారు. దీంతో గిరిజన రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. గత ఏడాది జీడిపిక్కల ధర కిలో రూ.110 నుంచి రూ.130 వరకు పలికింది. ఈ ఏడాది ప్రారంభంలోనే రూ.85 ధరకు పతనమవుడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీనికి తోడు గిరిజన ప్రాంతంలోని వారపు సంతలో ప్రైవేట్ వ్యాపారుల హవా సాగుతుంది. వారంతా సిండికేట్‌గా మారి నిర్ణయించిన తక్కువ ధరలకే జీడి పిక్కలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. జీసీసీ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులు ఆశించిన అంతా ధరకు కొనుగోలు చేయకపోవడంతో గిరిజన జీడి రైతులలో అయోమయ పరిస్థితి ఏర్పడింది.

గత ఐదేళ్లలో ఇదే కనిష్ఠ ధర

జీడి పిక్కల ధర గత ఐదు సంవత్సరాలలో ఇదే కనిష్ఠ ధర అని గిరిజన రైతులు వాపోతున్నారు. ఏటా జీడిపిక్కలకు రూ.85 నుంచి రూ.130లకు పైగా ధరలు ఉండేవని చెబుతున్నారు. అయితే ఈ ఏడాది రూ.70 నుంచి రూ.80లోగా ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని, తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారపు సంతల్లో వ్యాపారులంతా సిండికేట్‌గా మారి నచ్చిన ధరను నిర్ణయిస్తూ వ్యాపారుల మాయజలం ప్రదర్శిస్తున్నారు. అకాల వర్షాలతో జీడిపంట నష్టపోతున్నారు.దీంతోపాటు వ్యాపారుల సిండికేట్ ధరలకు రైతులు కోలుకోలేని విధంగా ఆర్థికంగా దెబ్బతింటున్నారు.

6,7 తేదీల్లో బస్‌పాస్ కౌంటర్ల మూసివేత

ఉక్కునగరం: ఏపీఎస్ఆర్టీసీ స్టీల్‌సిటీ డిపోలో ఈ నెల 6,7 తేదీల్లో బస్ పాస్ కౌంటర్లు మూసివేస్తున్నామని డిపో మేనేజర్ చటర్జీ తెలిపారు. బస్ పాస్ జారీ సాఫ్ట్‌వేర్‌లలో మార్పు చేస్తున్నందున ఆ రెండ్రోజులు కౌంటర్లు పని చేయవన్నారు. 8వ తేదీ నుంచి యథావిధిగా కౌంటర్లు తెరుస్తామని, బస్‌పాస్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

సింహాచలం: ఆర్టీసీ బస్‌పాస్‌లు జారీ చేసే అప్లికేషన్‌ను ఆధునికీకరిస్తున్న కారణంగా సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న బస్‌పాస్ కౌంటర్‌కు ఈనెల 6,7తేదీల్లో సెలవు ప్రకటించినట్టు డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. బస్‌పాస్ హోల్డర్స్ అందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

దుర్గమ్మ వారికి పసుపు కుంకుమల సమర్పణ



ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మవారు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి గ్రామ దేవత శ్రీ దుర్గమ్మ అమ్మవారి పండగ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం దొండపర్తి గ్రామస్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి అల్లూరి సత్యనారాయణరెడ్డి, కారాల మహేష్ మాట్లాడుతూ 10వ తేదీన పుట్టబంగారం తీసుకురావటంతో పాటు అమ్మవారిని గ్రామంలోకి తీసుకొచ్చి 9 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు చేయనున్నట్లు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు వేడుకలను పర్యవేక్షించారు.

ఘనంగా దుర్గమాంబ మారువారం పండగ

కంచరపాలెం: గొల్లకంచరపాలెం వాసుల ఆరాధ్య దైవం దుర్గమాంబ అమ్మవారి మారువారం జాతర శ్రీరామసేవా సమాజం(యాదవ్) ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ నేతృత్వంలో గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు మజ్జిగ, ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నేల డ్యాన్సులు నిర్వహించారు. తోటవీధిలో పుట్టబంగారం నుంచి అమ్మవారి ప్రధాన దేవాలయం వరకు అమ్మవారి ప్రధాన ఘటాన్ని జాతర వేడుకల్లో ఊరేగించారు.

వైఎస్సార్‌సీపీ హ్యాట్రిక్ విజయం

గిరిజనులంతా వైఎస్సార్‌సీపీ వైపే మొగ్గు



మాట్లాడుతున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత

చింతపల్లిరూరల్: సార్వత్రిక ఎన్నికల్లో అరకు పార్లమెంట్‌తో సహా అరకు, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ హ్యాట్రిక్ విజయోత్సవం నమోదు చేసుకుందని ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత అన్నారు. ఈ సందర్భంగా వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఫలితం ఊహించిందేనని, రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమంతోనే ఈ ఫలితాలు సాధ్యమైనట్టు చెప్పారు. మన్యంలో ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్నారు .విజయం సాధించిన అరకు పార్లమెంట్ అభ్యర్థి గుమ్మ తనూజరాణి, పాడేరు, అరకు ఎమ్మెల్యే అభ్యర్థులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగంనకు వారు శుభాకాంక్షలు తెలిపారు.

అన్యోన్య దాంపత్యం

భార్యను చంటిబిడ్డలా ఎత్తుకొని తీసుకెళ్తున్న భర్త



భార్య లక్ష్మిని ఎత్తుకొని తీసుకొని వెళ్తున్న భర్త వెంకటస్వామి, వెంట చిన్నారి బాబు చెర్రీ

రాజవొమ్మంగి: ఉదయాన్నే పొలానికి వెళ్లడం, పనులు లేని సమయాల్లో కూలీ పనులకు వెళ్లడం మండలంలోని లాగరాయి గ్రామానికి చెందిన వీకా వెంకటస్వామి అనే గిరిజనుని దిన చర్యలో ఓ భాగం. అతని జీవనంలో మరో తీయని బంధం, తన సహచరి భార్య లక్ష్మి. తాను ఎక్కడికి వెళ్లినా లక్ష్మిని చంటిపిల్లలా ఎత్తుకొని తీసుకెళ్లడం వీరి అన్యోన్య దాంపత్యానికి నిదర్శనం.. వెంకటస్వామి అనురాగానికి నిదర్శనం. లక్ష్మికి పోలియో కారణంగా చిన్నప్పుడే కాళ్లు చచ్చుబడిపోవడంతో నడవలేని పరిస్థితి. అయినా వెంకటస్వామి ఇష్టపడి లక్ష్మినే వివాహం చేసుకొన్నాడు. వెంకటస్వామి తన భార్య లక్ష్మిని కొంచెం దూరం చేతులపై, మరికొంత దూరం తన మోటారుసైకిల్‌పై తీసుకొని వెళ్తాడు. వీరికి రెండేళ్ల బాబు (చెర్రీ) ఉన్నాడు. లక్ష్మీ ఇంటి పనులు తానే స్వయంగా చేసుకొంటుంది. భార్యను ఎత్తుకొని తిరగడం కష్టమైనప్పటికీ వెంకటస్వామి ఎప్పుడూ భారంగా భావించలేదని చెబుతున్నారు. వారి అన్యోన్య దాంపత్య బంధాన్ని చూసిన ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు.

నిలువ నీడ కరువు



రాజవొమ్మంగిలో బస్‌షెల్టర్ లేక ఆరుబయట వేచి ఉన్న ప్రయాణికులు

రాజవొమ్మంగి: మండల కేంద్రం రాజవొమ్మంగి మూడు రోడ్ల అల్లూరి కూడలి వద్ద చాలా సంవత్సరాలుగా బస్ షెల్టర్ లేక ప్రయాణికులు నానా ఇబ్బంది పడుతున్నారు. దాదాపు 70 గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం నర్సీపట్నం, విశాఖపట్నం, పాడేరు, రంపచోడవరం, ఏలేశ్వరం, రాజమహేంద్రవరం, కాకినాడ తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లేందుకు వందల సంఖ్యలో ప్రయాణికులు ఇక్కడకు చేరుకొంటారు. బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్రమైన ఎండల్లో మహిళలు, పిల్లలు, వృద్ధులు సతమతమవుతున్నారు. గత్యంతరం లేక దుకాణాల వద్ద తలదాచుకొంటు బస్సుల కోసం ఎదురుచూస్తున్నట్టు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్‌షెల్టర్లు ఏర్పాటుచేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.



హట్టగుడలో నిరుపయోగంగా ఉన్న బస్‌షెల్టర్

శిథిలావస్థలో బస్‌షెల్టర్

అరకులోయ రూరల్: మండలంలో చినలబుడు పంచాయతీ హట్టగుడ ప్రధాన రహదారి కూడలిలో ఉన్న బస్‌షెల్టర్ అధ్వానంగా దర్శనమిస్తుంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరింది. బస్‌షెల్టర్ చెత్తాచెదారాలతో పేరుకుపోయి ఉంది. ఎండైనా..వానైనా ప్రయాణికులు బస్సులు కోసం ఆరుబయట వేచి ఉండాల్సి వస్తోంది. తీవ్ర దుర్గంధంతో అవస్థలు పడుతున్నామని, నిలువ నీడ కరువైందని ప్రయాణికులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఈ విషయంపై ఎంపీడీవో ఎల్.యాదగిరీశ్వరరావు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పొట్టి శ్రీరాములకు ఘన నివాళి



పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసిన స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అవతరణకు కృషి చేసిన శ్రీరాములను తెలుగు జాతి మర్చిపోదన్నారు. ఆయన జ్ఞాపకార్థం నెల్లూరు జిల్లాకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా పేరు పెట్టి 16 ఏళ్లయిందన్నారు. ఈ సందర్భంగా శ్రీరాములు విగ్రహానికి ఘన నివాళులర్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ వ్యవస్థాపకులు పిరట్ల నరసింహమూర్తి, ప్రతినిధులు గుంగుపాం నాగేశ్వరరావు, లక్ష్మి, స్వాతి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగుపడుతున్న సాగునీటి వనరులు



ఉపాధిహామీ పథకం ద్వారా అభివృద్ధి చెందిన కాలువ

మునగపాక : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పథకం ద్వారా కాలువలు, చెరువులతో పాటు రహదారులను అభివృద్ధి చేస్తున్నారు. గతంలో వ్యవసాయ రంగానికి అవసరమయ్యే సాగు నీరు ప్రవహించేందుకు కాలువలు అధ్వానంగా ఉండేవి.

దీంతో రైతులు సాగుకు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఉపాధి హామీ పథకం ద్వారా నేడు పలు సాగునీటి కాలువలు అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంటల సాగుకు అవసరమయ్యే నీరు కాలువలు, చెరువులతో అందుతుండడంతో పథకం మేలు చేస్తుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.